చీకటి

మేడమీద బాల్కనీలోనికి ఆరుమైళ్ళ అవతలగా వున్న సముద్రం నిరంతరాయంగా చల్లని గాలిని పోస్తోంది. అక్కడక్కడా మిణుకుమనే తారల కాంతివలన పలుచబడ్డ చీకటిని ఆకాశమనీ చిక్కగా గడ్డకట్టినట్లున్న చీకటిని నేలనీ అనుకోవాలి తప్పించి మరేమీ కనపడదు ఆ బాల్కనీలో కూర్చుంటే. అంతకంటే గదిలో బార్‌లైట్ మెత్తని వెలుగులో ఫాన్ వేసుకుని కూర్చోవటమే ఇష్టం లలితకు. ఇప్పుడు నారాయణి కోరికమీదనే బాల్కనీ లోనికి రావలసివచ్చింది. అందులోనూ లైటు తీసేసి చీకట్లో కూర్చోవటం తనకు ఎంతో ఇష్టం అన్నది నారాయణి. రోజంతా తీరికలేకుండా పనిలో సతమతమైపోయిన మనసుకు చీకట్లో ఒంటరిగా కాస్సేపైనా కూర్చుంటేగాని బరువు తగ్గి స్వేచ్ఛ పొందినట్లుండదట! ఎన్నో ఏళ్ళకు తరువాత కనిపించిన స్నేహితురాలి దగ్గర మొహమాటానికి వూరుకున్నదిగాని నిజానికి చీకటంటే ఏమాత్రం ఇష్టంలేదు లలితకు.

వృద్ధరాజమాతలాగా యీ మేడలో రాజ్యం చేస్తున్న అత్తగారిని చూచిపోవడమనే మొక్కుబడి చెల్లించుకోవడానికి అప్పుడప్పుడు యీ ఊరు వస్తుంది లలిత. ఈ 'రాక'లో విసుగ్గల్గించే విషయాలు అనేకం ఉన్నాయి. అందులో ముఖ్యమైనది వచ్చినప్పుడంతా 'నెలనెలా బైట చేరుతున్నావా?' అని ముసలామె అడగటం. పిల్లలు కావాలని ఏడవటం లేదు లలిత. వాళ్ళు లేకుంటేనే సుఖం అనుకుంటోంది. అందుకే విసుగు. రెండో విషయం యీ మేడ. విశాలమైన గదులతో, ఎత్తుగోడలతో, పెద్ద బాల్కనీలతో యీ మేడను సగం ఆస్తి ఖర్చు చేసి యీ శ్రీపురంలో కట్టించాడు మామగారు. అది ఆయన చేసిన పెద్ద బుద్ధితక్కువ పని అనుకుంటుంది లలిత. ఇదే పదిమైళ్ళవతలవున్న నెల్లూరులో కట్టించివుంటే ఎంత ఉపయోగంగా వుండేది? ఎంత దర్జాగా వుండేది? పోన్లెమ్మనుకుందామంటే, ఆ కట్టించటం వూరికి చివరగా పూర్వాభిముఖంగా కట్టారు. సాయంత్రాలు బాల్కనీలో కూర్చుంటే లైట్లూ రోడ్లూ మనుష్యులూ కనబడితే బాగుంటుంది. కాని ఇక్కడ చీకటి తప్పించి మరేమీ కనబడదు!

పది రోజుల క్రితం నెల్లూరులో వుండగా తల సగం నెరిసిపోయిన లావుపాటి

గుమాస్తాలాంటి మనిషి వచ్చి తాను నారాయణి భర్తననీ, తాసిల్దారుగా శ్రీపురానికి పక్కనున్న వూరికి బదిలీ అయివచ్చాననీ, నెల్లూరు వస్తుంటే తనను తప్పకుండా చూసిరమ్మని నారాయణి మరీమరీ చెప్పిందనీ అన్నప్పుడు లలితకు సంతోషంతోపాటుగా నారాయణిమీద చాలా జాలి కలిగింది. నారాయణికీ తన ఎదురుగ్గా కనిపిస్తున్న మిజరబుల్ స్పెసిమెన్‌కీ ఎక్కడి సంబంధం! అనుకున్నది. ఎల్లాగూ తాను ఇంకో పదిరోజుల్లో శ్రీపురం వస్తున్నాననీ అప్పుడు నారాయణిని కలుసుకుంటాననీ అతనితో చెప్పింది. చెప్పినట్లుగానే యిక్కడకు వచ్చిన మరునాడు సాయంత్రం నారాయణిని తీసుకురమ్మని కారు పంపింది.

కొంచెం స్థూలంగా, ఏమాత్రం నాజూకు లేకుండా కనిపిస్తూ మోటుగా మాట్లాడే నారాయణిని చూడగానే అంతకు ముందున్న వుత్సాహమంతా చప్పబడిపోయింది లలితలో. తామిద్దరూ కాలేజీలో బిఏ చదివే రోజుల్లో నారాయణి బంగారుతీగలాంటి అందగత్తె. తనకంటే తెలివైనది. తియ్యని కలలాంటి భవిష్యత్తుగలది. యిప్పుడు? ఈ మార్పు నారాయణిలో వచ్చిందా?

"ఆ దూరాన సముద్రం వుండాలి కదూ?" అన్నది నారాయణి పెద్దగా, మోటుగా, నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

"ఊ" అన్నది లలిత, ఆ మోటుదనాన్ని భరించలేని చిన్న విసుగును దాచిపెడుతూ.

"మనం కాలేజీలో చదువుతున్నప్పుడు నీకు సముద్రమంటే చాల ఇష్టం వుండేది" అన్నది నారాయణి, ఒక గొప్ప సత్యాన్ని ఆవిష్కరిస్తున్నట్లు.

లలిత మనసులో కొద్దిగా అశాంతి రేగింది. అదేదో ముఖ్యమైన విషయమా? పాత జ్ఞాపకాల్లో కూరుకుపోయి వుండటం నారాయణి మోటుదనానికి మరో చిహ్నంగా తోచి విసుక్కుంది. అవును... అప్పుడు తనకు సముద్రమంటే ఎంతో ఇష్టంగా వుండేది. ఎప్పుడూ హోరుమంటూ శబ్దం చేస్తూ, అనంతమైన శక్తిని లోన యిముడ్చుకోలేనట్లు ఉరకలూ పరుగులూ పెడుతుండే సముద్రంతో ఏదో తాదాత్మ్యం పొందేది మనస్సు. ప్రాణం వున్నదా లేదా అన్నట్లుగా నిర్జీవంగా చైతన్యరహితంగా వుండే తనను చైతన్యస్వరూపమైన సముద్రం అమితంగా ఆకర్షించింది. కాని, పెళ్లయ్యాక యీ పది సంవత్సరాల్లో ఎప్పుడో తెలియకుండానే ఆ సముద్రంతో సంబంధం పోయింది. 'అంతకంటే ఎక్కువ చైతన్యం నాలోనే ఏర్పడటంవలన కాబోలు!' అని నవ్వుకుంది లలిత.

"యిప్పుడు యిలాంటి పొద్దుపోని వూహలకి వీలుండదు, నారాయణీ! ఎప్పుడూ క్లబ్బు, స్నేహితులు, పార్టీలు, పిక్నిక్కులు, సినిమాలు... తోచకుండా వుండటమంటూ

వుండదు నాకు" అన్నది.

"అవును మరి... నీవు చాలా లక్కీ" అన్నది నారాయణి మెచ్చుకోలు ధ్వనిస్తున్న స్వరంతో. వచ్చినప్పటినుండీ యింటినీ, వస్తువుల్నీ తన సౌభాగ్యాన్నంతటినీ ఇంతింతలేసి కళ్ళతో నారాయణి పరిశీలిస్తున్న విషయం లలిత గమనించింది. 'పాపం! తాసిల్దారు భార్య' అనుకున్నది. తానూ టైర్ కంపెనీ రిప్రజెంటేటివ్ భార్య కాకమునుపు యిల్లాగే అనుకున్నది-మంచి సోఫాసెట్టూ, రిఫ్రిజిరేటరూ, కారూ వుంటే ఆనందం అరచేతిలో వుంటుందని. ఏడువందల జీతంనుండీ జాగ్రత్తగా కూడబెట్టిన డబ్బుతో అవన్నీ కొన్నారు. కాని సుఖజీవనం కావాలంటే కావలసినవి ఇంకా ఎన్నో వున్నాయని తెలిసింది యిప్పుడు.

"అమ్మా, యీ పరుపు మంచివాసనే" అని గదిలోంచీ కేకపెట్టింది నారాయణి మూడేళ్ళ కూతురు జలజ. లలిత లోపలికి చూసింది. బూరుగదూదిలో మంచిగంధప్పొడి చల్లించి కుట్టించిన పరుపుమీద తెల్లని దుప్పటిని పక్కకు తోసేసి మురికి బూట్లతో తొక్కి నాశనం చేస్తున్న జలజను చూడగానే కోపం వచ్చింది లలితకు. 'మానర్‌లెస్ ఛైల్డ్' అనుకుంది విసుగ్గా. "అమ్మా, పరుపంతా తొక్కి నాశనం చెయ్యకు, రా" అన్నది నారాయణి, ఆ పిల్లను యివతలికి రప్పిద్దామనే గట్టిప్రయత్నం చెయ్యకుండానే.

"అమ్మా యీ పరుపు బాగుంది. మంచి వాసన" అన్నది జలజ యింకా ఎక్కువగా పొర్లుతూ. "పోనీలే, చిన్నపిల్ల" అన్నది లలిత విసుగును కనపడనివ్వకుండా. అన్నదే చాలని నారాయణి పరుపును పిల్లకు వదిలేసి నిశ్చింతగా కూర్చుండిపోయింది. "ఏం పెంపకం! ఏం పిల్లలు! క్రమశిక్షణా లేదు, పాడూ లేదు. ఇంకా నయం మిగతా ముగ్గుర్నీ ఇంటిదగ్గరే వదిలేసి వచ్చింది" అనుకున్నది లలిత.

ఎదురుగ్గా అంతా చీకటి. ఆ చిక్కని చీకటీ పలుచని చీకటీ కలుస్తున్న దూరంలో ఎక్కడో వుండాలి సముద్రం. పగటిపూట వెలుగునింపుకొని మిడిసిపడే ఆకాశం చూపుమేర దూరమంతా ఆక్రమించుకొంటుంది. అప్పుడు పైర్ల పచ్చదనంతో నిండిన నేల అప్రధానంగా పేలవంగా కనిపిస్తుంది. ఆకాశమూ నేలా దేనికది వేరుగా వుంటుంది. అవి కలిసేచోట సముద్రం వుండదు. చీకట్లోనే వుంది సముద్రానికి అస్తిత్వం.

తగ్గుస్వరంతో, జ్ఞాపకాల లోతుల్నుంచీ మాట్లాడినట్లు "మా నాన్న పోయారు. తెలుసా?" అన్నది.

"ఆ, అల్లానా! అయామ్ వెరీ సారీ లల్లీ" అన్నది నారాయణి జాలిగా. లలితకు తండ్రితో వుండే సంబంధం ఎంత గాఢమైనదో నారాయణికి తెలుసు.

ఇంత దూరానికి, ఆరుమైళ్ళ దూరానికి, సముద్రపు హోరు వినబడుతుందా? ఇప్పుడు యీ నిశ్శబ్దంలో అతి మెల్లగా మెదడును స్పృశిస్తున్న ఆ భయంకరమైన హోరు

కేవలం తన వూహేనా? ఇదివరలో ఎప్పుడూ వినలేదు యీ శబ్దాన్ని. ఎన్నోసార్లు యీ యింటికి వచ్చినా యిలా చీకట్లో కూర్చోవటంగాని సముద్రాన్ని గమనించటంగాని జరుగలేదు.

ఎప్పుడో తాను చిన్నపిల్లగా వున్నప్పుడు, నాన్న అనబడే మేరుపర్వతంమీద ఆడుకునే సెలయేరుగా వున్నప్పుడు, తల్లిచాటునుంచీ తొంగిచూస్తున్న పిల్లిపిల్ల కళ్ళల్లోని ఘనీభవించిన జీవకాంతితో ప్రపంచాన్ని చూసినప్పుడు ఎక్కడ చూసినా సముద్రమే కనిపించింది. బాపట్లదగ్గర తమ వూరికి దగ్గరగానే వుండేది సముద్రం. అప్పట్లో ఒక్కసారి కూడా సముద్రాన్ని చూడలేదు నిజానికి. కాని వూరినిండా వుండే యిసుకనేలా, వూరిబయట నాగజెముడు పొదల్తో నిండిన యిసుక దిబ్బలూ, ఆ దిబ్బల్లో పరుగెత్తుతూ స్నేహితులతో ఆడుకున్న ఆటలూ, చెప్పాపెట్టకుండా ఆ యిసుక దిబ్బల్లో అక్కడక్కడా వెలిసిన దొరువులూ, ఆ దొరువులచుట్టూ పరిమళాలు వెదజల్లుతూవుండే మొగలిపొదలూ, ఆ పరిమళాల్లో నివసించే విషపు పాములూ, ఆ పాముల గురించిన భయంకరమైన వూహలూ, వూరిబయటి నాగారుబొమ్మ గుడికి వెళ్ళటానికి యిసుకలో సన్నగా మెలికలు తిరుగుతూ పారే ఏటి మీది సన్నని తాటి దుంగను దాటుతున్నప్పుడు, దుంగ ఒరుగుతుందేమో, ఏట్లో పడిపోతానేమో అన్న ఆదుర్దా... అన్నీ కలిసి సముద్రమనే గాఢమైన అనుభవం నిలిచింది మనసులో. అప్పుడు సముద్రమంటే పాములాంటి ఏరూ, మొగలిపొదల్లోని విషపుపాములూ కలిగించిన చిన్నచిన్న ఆదుర్దాలతో కూడిన విశాలమైన అనంతమైన ఆనందమయమైన ఇసుక. ఎక్కడ చూసినా యిసుక... శ్రీపురానికి సముద్రం దగ్గరే అయినా ఇక్కడ యిసుక లేదు. డబ్బు పండించే మట్టినేల వున్నది.

"మీ నాన్నగారు పోయి ఎన్నేళ్ళయింది?" అన్నది నారాయణి.

గుర్తులేదు. గుర్తులేనన్ని ఏళ్ళయిపోయింది! సముద్రంలాగే నాన్నగారూ స్మృతిపథంలో లేకుండా జారిపోయారు ఎప్పుడో, ఎల్లాగో! అమ్మ ఇవ్వవలసిన ప్రేమనూ, తాను ఇవ్వవలసిన రక్షణనూ రెండింటినీ తానే యిచ్చిన నాన్న!

సముద్రం చీకట్లోంచి మంచులాంటి గాలిని పోస్తోంది మీదికి.

"లోపలికి వెళ్దాం... మంచు కురుస్తోంది" అన్నది లలిత.

"ఇంకా కొంచెం సేపుందాం... యిక్కడ ఎంత బాగుంది!... నిన్ను చూస్తుంటే నాకు చాలా అసూయగా వున్నది, లల్లీ... చక్కగా కారున్నది నీకు. ఎన్నోసార్లు బీచ్‌కి వెళ్ళివుంటావు కదూ?" అన్నది నారాయణి.

ఒక్కసారే భర్త నాగేష్‌తో వెళ్ళింది లలిత. "ఏముంటుందక్కడా? మెడ్రాస్ బీచ్ అనుకున్నావా? మనుష్యులే వుండరు. బోర్" అన్నాడు. కాని లలిత బలవంతంమీద

వెళ్లారు. ఇసుకలో నడుస్తుంటే లలితకు చిన్ననాటి జ్ఞాపకాలు వెలికివచ్చాయి.

"మా వూరికి సముద్రం చాలా దగ్గర. మా వూరినిండా యిసుకే వుంటుంది" అన్నది. నాగేష్ చిత్రంగా చూశాడు. "ఎందుకూ యిసుక? చిన్నప్పుడు చూసిన యిసుకను చూడాలని యిప్పుడు నన్ను ఇక్కడకు యీడ్చుకొచ్చావన్నమాట! సెంటిమెంటల్ యిడియట్!" అన్నాడు. భర్త విసుగుతో లలితకూ ఆ పిక్నిక్ బోర్ అనిపించింది. తరువాత సముద్రాన్ని మరచిపోయింది. నిజంగానే నాగేష్ చెప్పినట్లు యిసుకలో ఏమున్నది?

ఈ చీకట్లో అన్నీ పనికిమాలిన జ్ఞాపకాలే వస్తున్నాయ్. నిష్ప్రయోజనమైన ఊహలు. ఇప్పుడు కావాలంటే ఎన్నిసార్లయినా బీచ్‌కి వెళ్లగలదు. కాని యిక్కడి బీచ్‌లో ఏమీలేదు. వట్టి బోర్ అని తెలిశాక ఎందుకు వెళ్ళటం?

"ఇహ లోపలికి పోదాం" అంటూ లేచి లైటువేసింది లలిత. ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

నారాయణి గదిలోని వస్తువులన్నింటినీ పరిశీలనగా చూస్తోంది. "ఈ సోఫాసెట్టు చాలా బాగుంది" అన్నది. మేము "కొత్త గాడ్రెజ్ సెట్ కొనుక్కున్నాము. ఈ పాత టేక్‌వుడ్ సెట్ ఇక్కడ వేసేశాం" అన్నది లలిత కొంచెం గర్వంగా.

పరుపుమీద పడుకున్న జలజ కుడికాలు బారుగా చాపుకొని చూచుకుంటూ "అమ్మా నా కాలు చూడు... ఎంత పెద్దగా వున్నదో" అన్నది. 'అవున్లే' అన్నది నారాయణి కిందనున్న తివాచీని చూస్తూ పరధ్యానంగా. "చూడమ్మా నా చెయ్యికూడా ఎంత పెద్దగా వున్నదో" అన్నది జలజ చేతిని బాగా ముందుకు చాపి. "అబ్బ దీనితో ఒకటే గొడవ" అని విసుక్కుంది నారాయణి. "దీనికీ వాళ్ళన్నకూ నాలుగేళ్ళు ఎడం వున్నది. ఇద్దరికీ నిముషం సరిపడదు. వాడంత పెద్దకావాలని దీని ఆశ" అన్నది లలితతో.

లలిత నవ్వి మళ్ళీ ఆలోచనలో పడిపోయింది... నారాయణి తనకున్న వస్తువుల్ని చూసి గొప్పగా వున్నాయనుకుంటోంది. కాని నారాయణికేం తెలుసు, తనకు లేనివీ కావాలసినవీ ఎన్ని వున్నాయో! రెడ్డిగారి భార్యకులాగా ఇంట్లో ఎప్పుడూ పదిమంది పనిమనుషులుండాలి. కిందవొకటీ పైన ఒకటీ రిఫ్రిజిరేటర్లు, ఏర్‌కండిషనరూ, ఏడాదికో కొత్త మోడల్ కారూ వుండాలి. ఎప్పుడో ఒక నాటికి అన్నీ సంపాదించి తీరాలి. అప్పుడుగాని కలగదు తృప్తి.

"నేను పెద్దయినాక యిన్నిన్ని పెన్సిళ్లు కొనుక్కుంటాను... అన్నకంటే ఎక్కువ" అన్నది జలజ.

"అప్పుడు అన్న పెన్నులు కొంటాడు. అవి కావాలని ఏడుస్తూ వుంటావు అంతే" అన్నది నారాయణి. జలజ అమాయకతకూ, పసితనానికీ నవ్వుకున్నారు. జలజకూడా నవ్వింది.

"నేను పెద్దయినాక గదినిండా బెలూన్లు కొనుక్కుంటాను" అంటూ పరుపు వాసన పీల్చి వూహాగానంలో పడిపోయింది జలజ.

"ఇది వాళ్ళ నాన్నకు చాలా ఫేవరిట్, తెలుసా? ఆయనలాగే ఎప్పుడూ ఊహాలోకంలో విహరిస్తూ వుంటుంది...ఆయనంటారు కదా, పిల్లలే భగవత్స్వరూపాలు, యీ ప్రపంచంనుంచీ మనిషిని రక్షించే శక్తి పిల్లలకే వున్నదీ అని... నీక్కూడా ఒక బిడ్డవుంటే బాగుంటుంది..." అన్నది నారాయణి లలితను పరీక్షగా చూస్తూ. ఆ మాటలంటున్న నారాయణిలో యింతవరకూ కనిపించిన అసంతృప్తి స్థానంలో ఏదో నిండుదనం కనిపించింది.

లలితకు నారాయణిమాట నచ్చలేదు. ఈ విధంగా తన ఆధిక్యం నిరూపించుకోవాలనుకుంటున్నది కాబోలు అనుకున్నది. తమాషాగా మూతీ ముక్కూ విరిచింది. "ఆ మాటనకు తల్లీ, ఏదో సుఖంగా వున్నాను యింతవరకూ...ఎక్కడ చూచినా పందుల్లాగా కని పడేస్తున్నారు పిల్లల్ని. పిల్లలంటే వుత్త బరువు బాధ్యతలేగాని క్షణం విశ్రాంతి వుంటుందా ఆ తరువాత?... ఆ భగవంతుడి సంగతి నాకు తెలియదుగాని నాకు మాత్రం యిదే బాగుంది" అన్నది మురికైపోయిన తెల్ల బెడ్‌షీటును చూస్తూ.

ఆ లావుపాటి గుమాస్తాలాంటి ఆయనకు మురికి బెడ్‌షీట్లకంటే యితరం ఏం తెలుస్తుంది? ప్రపంచంలో ఎన్నెన్ని భోగాలున్నాయో ఎలా వూహించగలడు, పాపం! గంధపు సువాసనలీనే పరుపుమీద పడుకోవటం ఎంత సుఖంగా వుంటుందో ఎలా తెలుసుకోగలడు! లలిత నవ్వుకుంది.

జలజ లేచివచ్చి నారాయణి మెడ కావిలించుకొని వేళ్ళాడుతూ "అమ్మా, నాకు నిద్దరొస్తుందే, యింటికి పోదాం" అన్నది.

"ఇంతసేపూ యీ పరుపు మంచి వాసన అన్నావుగా. ఇక్కడే పడుకో" అన్నది లలిత నవ్వుతూ.

"వూహూ... యిక్కడ పడుకోను... నాకు నిద్దరొస్తుంది... నాకు నాన్న, అన్న అందరూ కావాలి..." అంటూ తల్లిని ముందుకు లాగింది. కూతుర్ని పొదివిపట్టుకుని ముద్దుపెట్టుకుంది నారాయణి. "పోదామమ్మా... మరి ఆంటీకి టాటా చెప్పు" అంటూ లేచి నిలుచున్నది.

ఇంతలోనే పాలేరు సుబ్బడు వచ్చాడు. "అమ్మా, ఏందో టెలిగ్రాం వచ్చిందంట. పోష్టు జవాను వచ్చాడు" అన్నాడు. లలిత సంతకం చేసి తీసుకున్నది. "నాగేష్ ఇన్‌వాల్వ్‌డ్ సీరియస్ కార్ ఏక్సిడెంట్. అడ్మిటెడ్ జనరల్ హాస్పిటల్... శేఖర్" అని చదువుకున్నది. కాగితాన్ని అట్లే చూస్తూ వుండిపోయింది.

లలిత మొహం చూస్తున్న నారాయణికి అనుమానం తోచి లలిత చేతిలోని టెలిగ్రాం తానే తీసుకొని చదివింది. "అయ్యయ్యో, ఎంతపని జరిగింది!... ఏమీ

ప్రమాదం వుండదులే, భయపడకు" అంటూ ఓదార్పుమాట చెప్పింది. లలిత మాటా పలుకూ లేకుండా కూర్చుండిపోయింది. "వెంటనే నెల్లూరు వెళ్ళాలి కదా... అత్తగారికి చెప్పాలి... డ్రైవరుకు కబురు పెట్టనా?..." అంటూనే సుబ్బడిని పిలిచి విషయం చెప్పింది నారాయణి. సంగతి విన్న లలిత అత్తగారు ఏడుస్తూ పైకి వచ్చింది. "అసలు టెలిగ్రాంలో ఏమని వుందీ?..." అని కనుక్కుంది. "మొండి శిలలాగా బతుకుతున్నదానికి యీ వయసులో యీ కష్టంకూడా పెట్టావా భగవంతుడా!" అంటూ సన్నగా ఏడుస్తూ తల పట్టుకు కూర్చుండిపోయింది. "డ్రైవరు అన్నం తింటున్నాడు. కారు వెంటనే రెడీ చేస్తాడు" అని వార్త పట్టుకొచ్చాడు సుబ్బడు. ముసలమ్మ ఏడుస్తూనే ఇల్లు తాళం వెయ్యడానికి కిందికి వెళ్ళింది.

లలిత బాధకాని, ఆదుర్దాకాని అంటని ఒక అసామాన్య స్థితిలో వుండిపోయింది. మనసు చిక్కగా గడ్డకట్టిన చీకటిలా అగోచరమైపోయింది. యాంత్రికంగా పెట్టె సర్దింది. పర్సులో డబ్బు చూచుకున్నది. కిటికీ దగ్గరకు వెళ్ళి బయట చీకట్లోకి చూస్తూ నిలుచుంది. అకారణంగా తండ్రి గుర్తుకు వచ్చాడు... అప్పుడు ఆయనకు జబ్బుగా వున్నదని మేనత్త ఉత్తరం రాయించింది. ఉత్తరం చూసిన లలితకు మనసు పని చెయ్యలేదు. ఆయనకు తానొక్కతే కూతురు. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్న తనను కడుపులో దాచుకుని పెంచాడు. ఆయనకు కావలసినవాళ్ళు యిహ ఎవ్వరూలేరు... ఎవ్వరూలేరు... ఆ జబ్బు త్వరగా తీరేది కాదు. నెలల తరబడి మంచంలో వుంచేది... 'ఏంచేసేది, ఏంచేసేది?' అనుకుంది అయోమయంగా. ఏమీచెయ్యలేని నిస్సహాయతలో ఎంతోసేపు ఏడ్చింది. ఆవేశం చల్లబడ్డాక మనసు తనతో సంబంధంలేని చురుకుదనాన్ని పొందింది... 'తాను నగేష్ భార్య. ఈ యిల్లూ, యీ జీవితం నాగేష్‌ది. దీనిలో జబ్బుగా వుండే లలిత తండ్రికి స్థానం వుండదు' అనుకున్నది. లలిత ఆక్షణంలో కఠినాతికఠినమైన చీకటిముద్దగా మారిపోయింది. నాగేష్ ఉత్తరం చూసి "ముసలాయన పెన్షన్ డబ్బు వుందిగా, ఇంకేం, ముసలమ్మదగ్గర చేరింది. చెయ్యనీ, అదీ మంచిదేలే" అన్నాడు తేలిగ్గా. లలిత మాట్లాడకుండా వూరుకుంది...

నారాయణి వచ్చి లలిత భుజంమీద చెయ్యివేసింది. "భయపడకు" అన్నది.

"నాకు ఎవ్వరూ... ఎవ్వరూ... లేరు..." అన్నది లలిత. గొంతు కొద్దిగా ఒణికింది.

"ఇప్పుడేమైందనీ... బాగానే వుంటారులే... ధైర్యంగా వుండాలి" అన్నది నారాయణి.

లలిత చీకట్లోకి చూస్తూ వుండిపోయింది...

తరువాత పదిహేను రోజులకు ఒక ఉదయాన టెలిగ్రాం వచ్చింది. 'నాన్నకు చాలా సీరియస్‌గా వున్నది' అని. అంతా అయిపోయివుండవచ్చని లలితకు తోచింది. కాని ఏడుపు రాలేదు... మొద్దుబారిపోయిన మెదడు సుఖదుఃఖాల కతీతమైన ఒక అసామాన్య స్థితిలో ఉండిపోయింది. ఆలోచనలు తనతో సంబంధం లేనట్లుగా

ఎక్కడినుంచో వచ్చి ఎక్కడికో పోతున్నాయి. గడ్డకట్టిన చీకటిలాంటి మనసును కదిలించకుండా... 'అక్కడ ఏడవటం వగైరా గందరగోళం వుంటుంది కాబోలు' అనుకున్నది. 'ఇల్లూ అదీ అమ్మాలి కాబోలు. పదివేలవరకూ డబ్బు వస్తుంది' అనుకున్నది... ఇద్దరూ కారులో బయల్దేరారు. కనీసం ఆరుగంటల ప్రయాణం వుంది. మధ్యలో కారాపి మంచి హోటల్లోకి వెళ్ళారు. 'అక్కడ పరిస్థితులు ఎట్లా వుంటాయో, కడుపు నింపుకొని వెళ్తే మంచిది' అన్నాడు నాగేష్. రెండు స్వీట్లూ, వేడి వేడి పకోడీలూ, ఐస్‌క్రీం తీసుకున్నారు. పకోడీలు వేడిగా కరకరలాడుతూ చాలా రుచిగా వున్నాయి. మాంగో ఐస్‌క్రీం అంటే లలితకు ఎంతో ఇష్టం. ఎందుకో ఆనాటి రుచీ, అనుభవం మనసులో హత్తుకుపోయాయి. వూరికెళ్ళేసరికి తండ్రి ఉదయమే చనిపోయారనీ, ఆయన శవం తన కోసరమే ఉదయంనుండి ఎదురు చూస్తున్నదనీ తెలిసింది...

లలిత మనసులో ఏదో కదలిక ప్రారంభమైంది... వెనక్కు తిరిగింది. లైటు వెల్తురు కరుగ్గా తగిలి కళ్ళు కుంచించుకుపోయాయి. గభాల్న నారాయణి చేతులు పట్టుకుంది. "నీవూ నాతో నెల్లూరికి ఒస్తావా, నారాయణీ... నాకు ధైర్యంగా వుంటుంది..." అన్నది. "ఓ తప్పకుండా... తప్పకుండా..." అన్నది నారాయణి బిత్తరపోయి చూస్తూ.

ఎడారిలాంటి మనసులోనికి సముద్రపుగాలి వీచినట్లూ, ఒంటరితనంలో తోడు దొరికినట్లూ అనిపించింది లలితకు. "థాంక్స్, నారాయణీ మెనీ థాంక్స్... నీవు నాకెంత సహాయం చేస్తున్నావో నీకు తెలీదు" అన్నది. కొంచెంసేపు వూరికే వుండిపోయింది. అకస్మాత్తుగా "నీవు ఎప్పుడైనా వేడివేడిగా కరకరలాడే పకోడీలు తిని, మాంగో ఐస్‌క్రీమ్ తిన్నావా?... బాగుంటుంది" అన్నది.

నారాయణికేమీ అర్థం కాలేదు. "లలితా ప్లీజ్, పిచ్చి ఆలోచనలు చెయ్యవద్దు. ధైర్యంగా వుండాలి... కొంచెంసేపు మెదలకుండా పడుకో" అన్నది జాలిగా, ప్రేమగా...

లలిత కళ్ళల్లో తడిమెరిసి, పెద్ద ముత్యాలుగా మారి చెంపలమీదికి జారింది "ఒద్దు... ఒద్దు... తొందరగా వెళ్లాలి... ఆయన ఎంత బాధపడుతున్నారో..." అన్నది.

ఇంతవరకు తననుండి వేరుగా నిలిచివుండి గడ్డకట్టిన చీకటిలాంటి మనసు కరిగి, తనతో సంబంధం లేనట్లుగా ఒచ్చిపోతున్న ఆలోచనల్ని లోనికి లాక్కోవడం మొదలెట్టింది...

★★★